
**నేను కాలేజీలో చదివేటప్పుడు వేసవి సెలవుల్లో డెహ్రాలో వున్న మా అమ్మమ్మ దగ్గర గడిపేవాణ్ని. మే నెల మొదటి భాగంలో మైదాన ప్రాంతాల్ని విడిచిపెట్టి ఇక్కడికి వచ్చి , జూలై తర్వాత తిరిగి వెళ్ళేవాడ్ని. డెహ్రాకు ముప్ఫైమైళ్ళ దూరంలో వున్న డియోలిలో చిన్న రైల్వేస్టేషనుంది. ఈ ప్రాంతం ఇండియన్ టెరైకి ప్రారంభంలో వున్న దట్టమైన అడవుల్ని సూచిస్తుంది.**

# నిరీక్షణ

ఇంగ్లీష్: రస్కిన్‌బాండ్
స్వేచ్ఛానువాదం: వెంకట్




రైలు ఉదయం ఐదు గంటలకు డియోలి చేరుకుంది. స్టేషన్‌లో ఎలక్ట్రిక్ బల్బులూ, నూనెదీపాలు మసగ్గా వెలుగుతున్నాయి. అడవికి మధ్యలోవున్న రైలుపట్టాలు మసక వెలుతురులో కొద్దిగా కనిపిస్తున్నాయి. స్టేషన్‌లో ఒక వెయిటింగ్ రూం, ప్లాట్‌ఫారమ్ మీద చెప్పుకోదగ్గవి ఒక టీస్టాల్, పండ్లమ్మేతనూ, కొన్ని కుక్కలు ఉన్నాయి. ఎందుకంటే రైలు అడవుల్లోకి ప్రవేశించే ముందు పదినిమిషాలే ఆగుతుందక్కడ.

డియోలిలో ఎందుకు ఆగుతుందో అర్థంకాలేదు. అక్కడ ఏమీ లేదు. ఎవ్వరూ దిగలేదు ఎక్కనూ లేదు. ప్లాట్‌ఫారం మీద కూలీలెవరూ లేరు కానీ రైలు పదినిమిషాలు ఆగింది. ఇంతలో గంట మోగింది. గార్డు విజిల్ ఊదాడు. ప్రస్తుతానికి రైలు డియోలి వదిలి కనుమరుగైంది.

డియోలి స్టేషన్ దగ్గర్లో ఏం జరిగిందోనని ఆశ్చర్యానికి లోనయ్యాను. ఆ చిన్న ప్లాట్‌ఫారమ్‌లో ఎదురుచూడ్డానికి ఎవ్వరూ రానందుకు ఎప్పుడూ బాధపడుతుంటాను. ఆ ఊరును తిలకించడానికి ఏదో ఒకరోజు డియోలిలో దిగాలని నిర్ణయించుకున్నాను.

★ ★ ★

నాకు పద్దెనిమిదేళ్ళు మా అమ్మమ్మని చూడటానికి వెళ్తున్నాను. ఒక రాత్రిపూట రైలు డియోలి స్టేషన్‌లో ఆగింది. ఒక అమ్మాయి ప్లాట్‌ఫారమ్ మీదికొచ్చి బుట్టలమ్ముతుంది. ఉదయంపూట చలిలో ఆ అమ్మాయి భుజాలచుట్టూ ఒక శాలువా కప్పుకొని ఉంది. మాసిన బట్టలు, కాళ్ళకు చెప్పుల్లేవు. అయినా యవ్వనంలో వుండటంవల్ల ఆకర్షణీయమైన హుందాతనంతో నడుస్తుంది.

ఆమె నేను కూర్చొని వున్న కిటికీదాకా వచ్చి ఆగిపోయింది. నేను ఆమెను తదేకంగా చూస్తున్నానని గమించి మొదట చూడకుండా దాక్కుంది. వంటిపై చర్మం పారిపోయి ఉంది. చెదిరిపోయి మెరుస్తున్న నల్లని జుట్టు, బెదురుచూపులతో నల్లకళ్ళు. అవే కళ్ళు వెతుకుతూ తీక్షణంగా నన్ను తాకాయి.

ఏదో అడగాలని కొద్దిసేపు నా కిటికీ దగ్గరే నిలబడింది. నేనే నా సీటును వదిలి క్యారేజి తలుపు దగ్గరకెళ్ళాను. ప్లాట్‌ఫారమ్ మీద నిలబడి ఎదురుచూస్తూ నన్ను గమనించి ఇంకోవైపు చూస్తుంది. నేను నడుచుకుంటూ టీస్టాల్ దగ్గరకెళ్ళాను. చిన్నపొయ్యి మీద టీ గిన్నె ఆవిర్లు గక్కుతుంది. టీస్టాల్ యజమాని ఇంకోచోట ట్రైన్‌లో టీ అమ్ముతూ బిజీగా ఉన్నాడు. ఆ అమ్మాయి టీ స్టాల్ దగ్గర్నుండి నన్ను వెంబడించి-

''మీరొక బుట్ట కొంటారా? ఇవి చాలా గట్టివి. మంచి వెదురుతో చేసినవి'' అని అడిగింది.

''వొద్దు నాకు అవసరం లేద''న్నాను.

ఒకరినొకరు చూసుకుంటూ చాలాసేపు నిలబడ్డాం.

అప్పుడామె అంది ''నిజంగా బుట్ట మీ కవసరం లేదా?''

''సరే ఒకటివ్వు'' అన్నాను. పై నుంచి ఒకటి తీసుకొని ఆమెకు ఒక రూపాయిస్తూ ఆమె వేళ్ళు తాకడానికి చాలా ధైర్యం చేశాను.

ఆమె ఏదో చెప్పబోతుండగా గార్డు విజిల్ ఊదాడు. ఆమె ఏదో చెప్పింది. బెల్గూ రైలు ఇంజన్ చప్పుడుకు నాకు వినపడలేదు. నేను నా కంపార్ట్‌మెంట్ వైపు పరిగెత్తాను. బోగీలు కుదుపుకుంటూ రైలు ముందుకు సాగింది.

ఆమెను ప్లాట్‌ఫారమ్ దాటేవరకూ గమనించాను. ఒంటరిగా కదలకుండా నిలబడి నావైపే చూస్తూ నవ్వింది. సిగ్నల్ బాక్స్ వచ్చేవరకు చూశానామెను. ఈలోగా అడవి స్టేషన్ని కప్పివేసింది. అయినా ఒంటరిగా ఆమెవైపే చూస్తూ నిలబడ్డాను.

ప్రయాణమంతా కూర్చున్నా పడుకున్నా నల్లగా మెరిసే ఆ కళ్ళు; ఆమె రూపం నా ఆలోచనలను వెంటాడాయి.

డెహ్రా చేరుకునేసరికి ఆనాటి సంఘటన తగ్గిపోతూ దూరమైంది. అక్కడ వేరే విషయాలు, నా సొంత ఆలోచనలు నన్నాక్రమించాయి. రెండేళ్ళ తరువాత తిరుగు ప్రయాణంలో మళ్ళీ ఆ అమ్మాయి గుర్తుకొచ్చింది.

రైలు స్టేషన్ చేరుకోగానే ఆమె కోసం చూశాను. ప్లాట్‌ఫారమ్ మీదికి రావడం చూసి చాలా ఆశ్చర్యపడ్డాను. వెంటనే ఫుట్‌బోర్డు మీంచి దూకి ఆమె వైపు పరుగెత్తాను.

నన్ను చూడగానే నవ్వింది. నేనామెను గుర్తుంచుకున్నందుకు చాలా సంతోషించింది. నేనూ ఆనందపడ్డాను నన్ను గుర్తుపట్టినందుకు. పాత స్నేహితులు కలుసుకున్నట్టు ఇద్దరం సంతోషించాం.

బుట్టలమ్మడానికి ట్రెయిన్ దగ్గరకెళ్ళకుండా నేరుగా టీస్టాల్ దగ్గరకొచ్చింది. వెంటనే ఆమె నల్లని కళ్ళు కాంతిని సంతరించుకొన్నాయి. మరింత దగ్గర కాలేకపోయినందున కొంతసేపటి వరకు ఏమీ మాట్లాడుకోలేదు.

అప్పటికప్పుడు ఆమెను తీసుకోవాలనిపించి విపరీతమైన మానసిక వత్తిడికి లోనయ్యాను. ఆమెను విడిచిపెట్టి డియోలీ స్టేషన్ నుండి వెళ్ళాలనే ఆలోచనే భరించలేకుండా ఉన్నాను. ఆమె చేతిలో వున్న బుట్టల్ని తీసి నేలమీద పెట్టాను. అట్లానే ఒకదాని మీద చెయ్యేసింది నేనామె చేయి పట్టుకొని దగ్గరికి తీసుకున్నాను.

''ఢిల్లీ వెళ్తున్నా'' అన్నాను.

తలపంకించి ''నాకు ఎక్కడికీ వెళ్ళాలని లేదు'' అంది.

గార్డు విజిల్ వూదేసరికి రైలు వెళ్ళడానికి సిద్ధమైంది. ఆ పని చేసినందుకు అతనిమీద అసహ్యమేసింది.

''మళ్ళీ వొస్తాన్నేను'' అన్నాను. అలాగే అన్నట్టు తలవూపింది. గంట శబ్దం మారింది. పట్టాలమీద నుంచి రైలు మెత్తగా ముందుకు పోతుంది. ఆమెకు కన్నీటి వీడ్కోలు చెప్పి కదులుతున్న రైలువెంట పరుగెత్తాను...

ఈసారి ఆమెను మరచిపోలేదు. ప్రయాణంలోనే గాక ఆ సంవత్సరమంతా సజీవంగా మెరిసిపోతూ నా జ్ఞాపకాల్లో నిలిచిపోయింది. కాలేజి అయిపోగానే తొందర తొందరగా సామాను కట్టేసి ఎప్పుడూ వెళ్ళే రోజుల కంటే ముందే డెహ్రాకు బయలుదేరాను. మా అమ్మమ్మను చూడాలనే నా ఆత్రుతను చూసి ఆమె చాలా సంతోషించింది.

రైలు డియోలి దగ్గరికి వచ్చేసరికి పిరికివాణ్నయ్యాను. నాకు ఆశ్చర్యం వేసింది. ఆ అమ్మాయికి ఏం చెప్పాలి. అసలేం చెయ్యాలి. నిస్సహాయుడిలా నిలబడకూడదనుకున్నాను. కనీసం ఆమెతో మాట్లాడాలి. లేదా నా ఫీలింగ్స్‌నైనా చెప్పాలి.

రైలు డియోలి చేరుకుంది. ప్లాట్‌ఫారమ్ అంతా చూశాను. కాని ఆ అమ్మాయి ఎక్కడా కనిపించలేదు. తలుపుతీసి ఫుట్‌బోర్డు మీదకొచ్చాను. ఒక చెడు ఆలోచన మదిలోకొచ్చేసరికి నాలో నిరుత్సాహమెక్కువైంది. ఏదో ఒకటి చెయ్యాలనుకొని స్టేషన్ మాస్టర్ దగ్గరకు పరిగెత్తాను.

''ఇక్కడ బుట్టలమ్మే అమ్మాయిని చూశారా మీరు?'' అని అడిగాను.

''లేదే? నేను చూడలేదు. నీవేమైనా మర్చిపోకపోతే రైలెక్కడం మంచిది'' అన్నాడు స్టేషన్ మాస్టర్.

ప్లాట్‌ఫారమ్ దాటి మైదానంలో వున్న పట్టాల మీద నిలబడి ఒక మామిడిచెట్టు ఎక్కి అడవిలోకి వెళ్ళే గతుకుల రోడ్డువైపు చూశాను. ఈ రోడ్డు ఎక్కడిదాకా వెళ్తుందీ? రైలు ముందుకు కదిలి స్టేషన్ దాటుతుంది. ప్లాట్‌ఫారమ్ మీదనుంచి పరిగెత్తుకుంటూ వచ్చి నేనున్న కంపార్ట్‌మెంట్‌లోకి చేరుకున్నాను. రైలు వేగాన్ని పుంజుకొని అడవుల గుండా పరిగెత్తుతుంది. నేను తలుపు దగ్గర అచేతనంగా కూర్చొని ఉన్నాను.

ఆ అమ్మాయిని కలవాలంటే ఏం చేయాలి? అతికష్టం మీద రెండుసార్లు మాట్లాడ్డం తప్ప ఆమె గురించి ఏమీ తెలియదు. నిజంగా ఏమీ తెలియదు. అట్లాంటి అమ్మాయి గురించి దయగా, బాధ్యతగా ఇంతకుముందెప్పుడూ ప్రవర్తించలేదు నేను.

వచ్చి కనీసం రెండు వారాలు కూడా వుండనందుకు మా అమ్మమ్మ చాలా విచారించింది. పైగా వచ్చిన దగ్గర్నుంచీ జ్వరంతో బాధపడ్డాను. తిరుగు ప్రయాణంలో డియోలీ స్టేషన్ మాస్టర్‌ని ఆ అమ్మాయి గురించి ఇంకొన్ని వివరాలు అడగాలనుకున్నాను.

కానీ డియోలీలో కొత్తగా వచ్చిన స్టేషన్ మాస్టర్ వున్నాడు. ఇంతకు ముందున్నతను ఈ వారంలోపే వేరే పోస్ట్‌కు బదిలీ అయి ఉంటాడు. కొత్తగా వచ్చిన మాస్టర్‌కు బుట్టలమ్మే అమ్మాయి గురించి ఏమీ తెలియదు. ఇంతలో జిడ్డోడుతున్న బట్టలు వేసుకుని, సన్నగా, ముడతలు పడివున్న టీస్టాల్ యజమాని కనిపించాడు.

''బుట్టలమ్మే అమ్మాయిని చూశావా?'' అని అడిగాను.

''అవును. అట్లాంటి అమ్మాయి ఇక్కడ ఉండడం చూశాను. కానీ ఈ మధ్య కనిపించడం లేదు'' అన్నాడు.

''ఎందుకు రావడం లేదు. ఆమెకేమన్నా అయిందా?'' అడిగాను.

''ఆ అమ్మాయి నాకు బంధువేమీ కాదు. నాకెట్లా తెలుస్తుందీ?'' అన్నాడతడు.

మరోసారి రైలు కోసం పరుగెత్తాను.

ఇంకోసారి వచ్చినప్పుడు డియోలీ స్టేషన్‌లో దిగి, ఆ వూర్లో ఒక రోజు వుండి, తన నల్లని, దయాపూరితమైన చూపులతో నా హృదయాన్ని దోచుకున్న ఆ అమ్మాయి గురించి తెలుసుకోవాలని నిర్ణయించుకున్నాను. ఈ ఆలోచన రాగానే ఫైనల్ ఇయర్ మొత్తం హాయిగా గడపొచ్చునని ఎంతో తృప్తినిచ్చింది.

వేసవిలో మరొకసారి డెహ్రాకు బయలుదేరాను. రాత్రిపూట రైలు డియోలీ స్టేషన్‌లో ఆగింది. ప్లాట్‌ఫారమ్ మొత్తం కలియజూశాను. ఆ అమ్మాయి రూపం కనిపించకపోవడంతో మళ్ళీ నిరాశే మిగిలింది నాకు.

★ ★ ★

ఏది ఏమైనా ఆ అమ్మాయి కోసం డియోలీలో ఒకరోజు వుండటం నా చేతకాలేదు.

ఇదంతా ఒక నవలో, సినిమాలో లేదా కలగన్నాననుకొని ఈ విషాదానికి తృప్తికరమైన ముగింపు ఇవ్వాలనుకున్నాను.

నిజంగా ఆ అమ్మాయికి ఏం జరిగిందో తెలుసుకోవడానికే భయమేస్తుంది. డియోలీలో ఆ అమ్మాయి ఎంతోకాలం వుండకపోవచ్చు. పెళ్ళి చేసుకుని వుండచ్చు లేదా ఏదైనా తీవ్రమైన అనారోగ్యానికి గురై వుండవచ్చు.

గడిచిన కొన్ని సంవత్సరాల్లో చాలాసార్లు డియోలీ స్టేషన్ మీదుగా వెళ్ళాను. వెళ్ళిన ప్రతిసారీ కిటికీలోంచి అర్దాశతో చూస్తాను. అదే చిరునవ్వుతో నావైపు చూస్తుంటుందేమోనని.

ఇక ఎప్పుడూ డియోలీలో ఆగను.

కిటికీ గుండా ప్లాట్‌ఫారమ్ వైపు చూస్తూ, బుట్టలతో అదే చిరునవ్వుతో ఎప్పటికైనా కనిపిస్తుందనే ఆశతో కలలు గంటూ ఎదురుచూడటానికి నా మనసు కోరుకుంటుంది.

ఎన్నోసార్లు డియోలీ నుంచి వెళ్ళినా అక్కడ మాత్రం ఆగలేదు.